నమస్తే తెలంగాణ
ఖమ్మం
5 | ఖమ్మం, శుక్రవారం 29 డిసెంబర్ 2023 | KHAMMAM

ఎరువుల వాడకం తగ్గించాలి

జిల్లా వ్యవసాయాధికారి విజయనిర్మల

వరి పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి విజయనిర్మల, ఏడీఏ విజయచంద్ర

తిరుమలాయపాలెం, డిసెంబర్ 28 : రైతులు సాగు విధానంలో రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువుల వాడకాన్ని పెంచాలని జిల్లా వ్యవసాయాధికారి విజయనిర్మల అన్నారు. మండలంలోని జల్లేపల్లి, పాతర్లపాడు, తాళ్లచెరువు, దమ్మాయిగూడెం ప్రాంతాల్లో గురువారం వేరుశనగ, వరి, పండ్ల తోటలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ నూతన శాస్త్రీయ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని అధునాతన పద్ధతుల్లో పంటలు సాగు చేయాలని సూచించారు. రైతులు భూసార పరీక్షలకు అనుగుణంగా అనుకూలమైన పంటలను మాత్రమే సాగు చేసుకోవాలని కోరారు. సాగులో మేలు రకమైన విత్తనాలను ఎంచుకోవాలని విజ్ఞప్తి చేశారు. వరి, వేరుశనగ పంటల్లో వివిధ రకాల తెగుళ్లను పరిశీలించిన ఆమె తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలపై రైతులకు వివరించారు. కార్యక్రమంలో కూసుమంచి ఏడీఏ విజయచంద్ర, వ్యవసాయాధికారి నారెడ్డి సీతారామరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

‘ప్రజా పాలన’ను సద్వినియోగం చేసుకోండి

భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు

మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు

భద్రాచలం, డిసెంబర్ 28 : అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రజా పాలన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు అన్నారు. గురువారం పట్టణంలోని తహసీల్దార్, గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన ప్రజా పాలన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మ్యానిఫెస్టోలో తెలిపిన విధంగా వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేయాలన్నారు. వంటింటి గ్యాస్ రూ. 500లకే ఇస్తామని చెప్పిన విధంగా అర్హులైన ప్రతి కుటుంబానికి అందజేయాలన్నారు. ఇళ్లు లేని వారికి ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా రూ.5 లక్షలు అందజేయాలని, ప్రజా పాలన దరఖాస్తుల స్వీకరణలో ముందుగా వృద్ధులు, దివ్యాంగులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఆసరా పింఛన్ పొందుతున్న వారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదని ఎమ్మెల్యే తెలిపారు. పెన్షన్‌కు అర్హులైన కొత్త వారు మాత్రమే చేయూత పింఛన్ కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో మాలోత్ మంగీలాల్, తహసీల్దార్ శ్రీనివాస్, ప్రత్యేక అధికారి బీ.నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలన గ్రామసభలు షురూ

- ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించిన అధికారులు
- క్షేత్రస్థాయిలో పర్యటించిన కలెక్టర్, సీపీ
- హాజరైన ఎమ్మెల్యేలు, జడ్పీ చైర్మన్
- కొరవడిన అవగాహన.. ఇబ్బందిపడిన దరఖాస్తుదారులు
- రేషన్‌కార్డుల ఆప్షన్ లేదని ప్రజలు నిరుత్సాహం

ఖమ్మం రూరల్ మండలంలో ఏర్పాటు చేసిన సభలో దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

ఖమ్మం, డిసెంబర్ 28 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన అభయహస్తం పథకం కోసం గురువారం జిల్లావ్యాప్తంగా ప్రజాపాలన గ్రామసభలు ప్రారంభమయ్యాయి. ఒకరోజు ముందుగానే గ్రామాల్లో పంచాయతీ సెక్రటరీలు, సిబ్బంది, అంగన్‌వాడీలు నెంబర్లు వేసిన దరఖాస్తు ఫారాలను ఇంటింటికీ వెళ్లి అందజేశారు. ఉదయం 8గంటలకే గ్రామసభలు ప్రారంభమయ్యాయి. సభల నిర్వహణ, ప్రజల ఇబ్బందులు, ఇతర సమస్యలను తెలుసుకునేందుకు స్వయంగా కలెక్టర్ వీపీ గౌతమ్, పోలీస్ కమిషనర్ విష్ణు ఎస్ వారియర్, ఖమ్మం మున్సిపల్ కమిషనర్ ఆదర్శ్ సురభి క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఖమ్మం నగరంతోపాటు, నేలకొండపల్లి, ముదిగొండ మండలంలో పర్యటించిన వారు అధికారులకు అవసరమైన సూచనలతోపాటు, ప్రజల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఆయా గ్రామాల్లో జరిగిన గ్రామసభల్లో సత్తుపల్లి, వైరా ఎమ్మెల్యేలు మట్టా రాగమయి, రాందాస్‌నాయక్, జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్‌రాజు హాజరయ్యారు, వీరితోపాటు ఆయా గ్రామాల జడ్పీటీసీలు, ఎంపీపీలు, సర్పంచులు, ఇతర ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. ఉదయం, మధ్యాహ్నం రెండు విడతలుగా గ్రామసభలు ఏర్పాటు చేశారు. ఒక టీంకు తహసీల్దార్, మరో టీంకు ఎంపీడీవో నేతృత్వం వహించారు.

హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు

జిల్లావ్యాప్తంగా ఆయా మండలాల పరిధిలో ముందుగా ఏర్పాటు చేసిన ప్రణాళిక ప్రకారం ప్రజాపాలన గ్రామసభలు జరిగాయి. ప్రతి మండలంలో రెండు టీంలు, నాలుగు గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. ఖమ్మం నగరంలోని ఆయా డివిజన్‌లో జరిగిన గ్రామసభల ఏర్పాట్లను కలెక్టర్ వీపీ గౌతమ్, పోలీస్ కమిషనర్ విష్ణు ఎస్ వారియర్, మున్సిపల్ కమిషనర్ ఆదర్శ్‌సురభితో కలిసి పర్యవేక్షణ చేశారు. నేలకొండపల్లి మండలం ఆరెగూడెం గ్రామసభలో వారు పాల్గొని ప్రజలు, అధికారులకు పలు సూచనలు చేశారు. ఖమ్మంరూరల్ మండలం బారుగూడెంలో పాలేరు నియోజకవర్గ స్పెషలాఫీసర్ రాజేశ్వరి గ్రామసభను ప్రారంభించారు. బోనకల్‌లో జరిగిన గ్రామసభలో డీఆర్డీవో విద్యాచందన, మధిర మున్సిపాలిటీ ఏడోవార్డులో మున్సిపల్ చైర్మన్ మొండితోక లలిత, వైరా మండలం కొష్టాల గ్రామంలో వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ పాల్గొన్నారు. ముదిగొండ మండలం ఖానాపురం గ్రామసభ ఏర్పాట్లను కలెక్టర్, సీపీలు పర్యవేక్షణ చేశారు. వైరా పట్టణంలోని ఒకటో వార్డు గ్రామసభలో మున్సిపల్ కమిషనర్ నూతకాని జైపాల్, కమిషనర్ కరుణాకర్ పాల్గొన్నారు. మధిర మండలం నక్కలగుంపు గ్రామంలో జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్‌రాజు హాజరయ్యారు. సత్తుపల్లి మండలం చోడవరం గ్రామసభలో సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి పాల్గొన్నారు.

అయోమయంలో దరఖాస్తుదారులు

ఆరు గ్యారెంటీలకు సంబంధించిన పథకాలకు దరఖాస్తు ఎలా చేసుకోవాలో సరైన అవగాహన లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఏమి జతపచాలి అనే విషయంలో అయోమయానికి గురయ్యారు. ఉదయం సభల్లో కొందరు దరఖాస్తుఫారంతోపాటు అన్ని ధ్రువీకరణ పత్రాలు జతపరిచి అందజేశారు. దీంతో మిగిలిన వారు పూర్తిస్థాయిలో అవసరమైన ధ్రువీకరణ పత్రాలు తమవద్ద లేవనే ఉద్దేశంతో వెనుదిరిగిన పరిస్థితి కనపడింది. అప్పటికప్పుడు జిరాక్స్ పత్రాలను తీసుకొచ్చేందుకు జిరాక్స్ సెంటర్లకు ప్రజలు బారులుదీరారు. ఇకపోతే రేషన్‌కార్డు కోసం ఆప్షన్ లేకపోవడంతో చాలామంది అదే విషయంపై అధికారులను సంప్రదించారు. వాటికి సంబంధించి ప్రత్యేక దరఖాస్తులను తీసుకుంటామని చెప్పారు. మహాలక్ష్మి పథకానికి సంబంధించి ఇంట్లో ఇద్దరు ఉంటే వారి పేర్లు నమోదు చేసుకునే అవకాశం లేకపోవడంతో అయోమయానికి గురయ్యారు. అదేవిధంగా ఒకే ఇంట్లో రెండు గ్యాస్ కనెక్షన్లు, రెండు కరెంట్ మీటర్లు ఉన్నవారి సందేహాలను నివృత్తి చేయలేక అధికారులు సైతం అక్కడక్కడ దాటవేతను ప్రదర్శించారు. చిన్నపిల్లలకు ఆధార్ కార్డు లేనివారికి వివరాలు ఎలా పొందుపరచాలనే విషయంపై క్లారిటీ లేకుండాపోయింది. ముఖ్యంగా కౌలు రైతుల తమ ఆధారం ఎలా చూపించాలని అనే విషయంపై మల్లగుల్లాలు పడ్డారు. ఉపాధిహామీ కూలీలు అయి ఉన్నప్పటికీ జాబ్‌కార్డు నెంబర్లు తెలవకపోవడం, వారి దగ్గర జాబ్‌కార్డులు లేకపోవడంతో వారు దరఖాస్తు ఫారంలో సదరు వివరాలు నమోదు చేయలేకపోయారు.

అయోమయం.. గందరగోళం

దరఖాస్తులు అందక ప్రజల అవస్థలు

ప్రజాపాలన సభల్లో కొరవడిన అవగాహన

సత్తుపల్లి టౌన్, డిసెంబర్ 28 : కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయనున్న ఆరు గ్యారెంటీలకు సంబంధించి ఏర్పాటు చేసిన ప్రజాపాలన గ్రామసభల్లో అవగాహన కొరవడింది. దీంతో ప్రజలు అయోమయానికి గురయ్యారు. ఆరు గ్యారెంటీలకు సంబంధించి పథకాలకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు స్వీకరించేందుకు గురువారం అట్టహాసంగా గ్రామసభలు ప్రారంభమయ్యాయి. సత్తుపల్లి పట్టణంలోని 1, 2, 5, 6వ వార్డుల్లో జరిగిన సభల్లో చాలామంది ఏ పథకానికి దరఖాస్తు చేసుకోవాలో తెలియక అయోమయ పరిస్థితి నెలకొంది. కొన్నిచోట్ల దరఖాస్తు ఫారాలు కోసం వేచిచూడాల్సి వచ్చింది. ఒకటి, రెండు పథకాలకు మాత్రమే దరఖాస్తు చేసి అందజేశారు. తర్వాత తెలుసుకొని తాము ఆరు గ్యారెంటీలకు సంబంధించి దరఖాస్తు చేసుకోలేకపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ముందస్తుగా అధికారులు అవగాహన కల్పించకపోవడంతో గిజిబిజి నెలకొంది.

దరఖాస్తుపై అవగాహన లేదు

నాకు ప్రస్తుతం వృద్ధాప్య పింఛన్ వస్తున్నది. నాకు సొంత ఇల్లు లేదు. తిరిగి మళ్లీ వృద్ధాప్య పింఛన్ కోసమే దరఖాస్తు చేసుకున్నాను. ఉచిత పథకాలు ఇచ్చే విషయంలో నాకు ఎవరూ చెప్పకపోవడం, దరఖాస్తుఫారం ఎలా నింపాలనే దానిపై అవగాహన లేకపోవడంతో పింఛన్ కోసమే తిరిగి దరఖాస్తు చేసుకున్నాను.

– రేగళ్ల వెంకటరమణ, 5వ వార్డు, హనుమాన్‌నగర్, సత్తుపల్లి

ఏ పథకానికి దరఖాస్తు చేయాలో తెలియలేదు

గ్రామసభ వద్ద ఏ పథకానికి దరఖాస్తు చేసుకోవాలో చెప్పకపోవడంతో అయోమయానికి గురయ్యా. కేవలం వృద్ధాప్య పింఛన్‌కు మాత్రమే దరఖాస్తు చేసుకున్నా. అందులో మిగిలిన వాటి గురించి తెలియక.. అవగాహన లేమితో పింఛన్‌కు దరఖాస్తు చేసి అధికారులకు ఇచ్చా.

– కోట హరిబాబు, 5వ వార్డు, సత్తుపల్లి

కుటుంబం యూనిట్‌గా ఒకే దరఖాస్తు

- అన్ని పథకాలకు అందులోనే దరఖాస్తు చేసుకోవాలి
- అప్లై చేసేందుకు కుల, ఆదాయ సర్టిఫికెట్లు అవసరంలేదు
- ఆధార్, ఆహార భద్రత కార్డుల జిరాక్సులే జతపర్చాలి
- సందేహాలు ఉంటే హెల్ప్ డెస్కుల్లో నివృత్తి చేసుకోవచ్చు
- ఖమ్మంలోని దరఖాస్తుల స్వీకరణ పరిశీలనలో కలెక్టర్

ప్రజాపాలన సభ వద్ద మాట్లాడుతున్న ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్, చిత్రంలో సీపీ విష్ణు, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి

ఖమ్మం, డిసెంబర్ 28: అర్హులకు ప్రభుత్వ పథకాల లబ్ధిని చేకూర్చేందుకు ప్రజాపాలన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్ పేర్కొన్నారు. అభయహస్తం ఆరు గ్యారెంటీలకు దరఖాస్తు చేసుకునేందుకు కుల, ఆదాయ సర్టిఫికెట్లు అవసరంలేదని, ఆధార్, ఆహార భద్రత కార్డుల జిరాక్సులు జతపరిస్తే సరిపోతుందని స్పష్టం చేశారు. కుటుంబం యూనిట్‌గా ఒకే దరఖాస్తు సమర్పించాలని సూచించారు. ఖమ్మం నగరంలో గురువారం పర్యటించిన ఆయన.. 29వ డివిజన్ ప్రొఫెసర్ జయశంకర్ పార్కు వద్ద నిర్వహించిన ప్రజాపాలన సభలో సీపీ విష్ణు ఎస్ వారియర్‌తో కలిసి పాల్గొన్నారు. తొలుత సభ ఏర్పాట్లు, కౌంటర్లు, స్వీకరించిన దరఖాస్తులు, ప్రజలు తెచ్చిన దరఖాస్తులను పరిశీలించారు. అలాగే, ప్రజలు దరఖాస్తులు సమర్పించాక అధికారులు వాటిని నమోదు చేసుకొని ప్రతిగా తిరిగి రసీదును అందిస్తున్నదీ లేనిదీ అడిగి తెలుసుకున్నారు. అధికారులు నెంబరు వేసి ఇచ్చిన దరఖాస్తును భద్రపర్చుకోవాలని సూచించారు. కౌంటర్లలో విధులు నిర్వర్తించే అధికారులు.. ప్రజలు తెచ్చే దరఖాస్తుల్లో అన్ని వివరాలు పొందుపర్చి ఉన్నాయో లేదో గమనించాలని, వారు పూరించని వివరాలు వారికి అర్థత లేకనే వదిలేశారో లేదో తెలుసుకోవాలని, దరఖాస్తుదారులు సందేహాలు వ్యక్తం చేస్తే వాటిని నివృత్తి చేయాలని సూచించారు. ప్రజలు జిరాక్స్ తీసిన అప్లికేషన్ ఫారాలను కూడా పూరించి సమర్పించవచ్చని అన్నారు. కాగా, సభలో ముందుగా ప్రజాపాలన కార్యక్రమం ఉద్దేశం వివరిస్తూ ముఖ్యమంత్రి ప్రజలకు పంపిన సందేశాన్ని చదివి వినిపించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ప్రజాపాలన గ్రామసభల నిర్వహణకు 62 బృందాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. దరఖాస్తు ఫారాలను ప్రతి ఇంటికి సరఫరా చేస్తున్నామన్నారు. దరఖాస్తుదారులు ముందుగానే తమ దరఖాస్తులను నింపి సభ వద్దకు రావాలని సూచించారు. మహాలక్ష్మి, రైతు భరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు, చేయూత పథకాల దరఖాస్తులు స్వీకరిస్తున్నామని, కుటుంబం నుంచి ఒకరు వచ్చి దరఖాస్తు చేస్తే సరిపోతుందని, అన్ని పథకాలకు కలిపి కుటుంబం యూనిట్‌గా ఒక దరఖాస్తు మాత్రమే సమర్పించాలని సూచించారు. సందేహాలుంటే హెల్ప్ డెస్కుల్లో అడిగి నివృత్తి చేసుకోవచ్చని, దరఖాస్తు నింపడంలో అధికారుల సహాయం పొందవచ్చని తెలిపారు. దరఖాస్తుల్లో పొందుపరిచిన వివరాలను నమోదు చేసుకుంటామని, అర్హులందరికీ పథకాలు వర్తింపజేస్తామని అన్నారు. గ్రామసభల సమయంలో అందుబాటులో లేని వారు ఆందోళన చెందొద్దని, జనవరి 6 వరకు తమ దరఖాస్తులను వార్డు, పంచాయతీ కార్యాలయాల్లో అందజేయవచ్చని సూచించారు. సభల షెడ్యూల్ గురించి ఇప్పటికే విస్తృతంగా ప్రచారం చేస్తున్నామన్నారు. కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి, జడ్పీ సీఈవో అప్పారావు, ఇతర అధికారులు విజయలక్ష్మి, శ్రీరామ్, హరికృష్ణ, సత్యనారాయణరెడ్డి, కార్పొరేటర్ కే.సరిత తదితరులు పాల్గొన్నారు.

నేడు 121 ప్రదేశాల్లో గ్రామసభలు : కలెక్టర్

మామిళ్లగూడెం, డిసెంబర్ 28 : ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం జిల్లాలోని 121 ప్రదేశాల్లో గ్రామసభలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ వీపీ గౌతమ్ తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. అలాగే ప్రజలు తమ ఆధార్ కార్డుల్లో ఉన్న పాత రాష్ట్రం పేరు ఆంధ్రప్రదేశ్‌ను తెలంగాణగా మార్పులు చేయాల్సిన అవసరం లేదని సూచించారు.

సందేహాలను నివృత్తి చేసేదెవరు?

- గ్రామసభల్లో దరఖాస్తుదారుల అయోమయం
- తొలిరోజు అంతగా కనిపించని స్పందన
- కౌంటర్లను పరిశీలించిన ఎమ్మెల్యేలు, అధికారులు

సుజాతనగర్ మండలం కోమటిపల్లిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

భద్రాద్రి కొత్తగూడెం, డిసెంబర్ 28 (నమస్తే తెలంగాణ) : ప్రజా పాలన గ్రామసభల్లో దరఖాస్తు చేసుకోవడానికి వచ్చిన దరఖాస్తుదారుల్లో గందరగోళం నెలకొంది. దరఖాస్తు చేసుకుంటే ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయా.. రావా.. అనే ప్రశ్నలు వారి మెదళ్లను తొలుస్తున్నాయి. జిల్లావ్యాప్తంగా ఉదయం 8 గంటలకే ప్రారంభమైన ప్రజా పాలనకు జనం నుంచి స్పందన అంతగా కనిపించలేదు. దరఖాస్తు చేసుకోవడానికి వచ్చిన ప్రజల సమస్యలకు అధికారులు సమాధానం చెప్పడం తప్ప పూర్తిస్థాయి పరిష్కారం చూపించలేదు. చుంచుపల్లి మండలం ఎన్‌కే నగర్‌లో జరిగిన ప్రజా పాలనకు వచ్చిన దరఖాస్తుదారు గత ఏడాది నుంచి రేషన్ రావడం లేదని, పాత కార్డు నెంబర్ చెల్లుతుందా.. లేదా.. అని అడగ్గా.. నెంబర్ వేయండి.. తర్వాత ఆన్‌లైన్‌లో సరిచేసుకోవాలి అధికారులు చెప్పారు. దీంతో దరఖాస్తు ఇచ్చిన సదరు మహిళ ఆందోళనగానే ఇంటికి వెళ్లింది. సుజాతనగర్ మండలం కోమటిపల్లికి చెందిన ఓ రైతు నేను పొలం కౌలుకు చేసుకుంటున్నాను.. నాకు ఆ రైతు పొలం సర్వే నెంబర్ తెలియదు.. దరఖాస్తులో ఎలా వేయాలని అడిగారు.. దీంతో అధికారుల నుంచి సమాధానం రాలేదు. ఇలాంటివి ఒకటి కాదు రెండు కాదు ప్రతి గ్రామంలో ప్రజలకు సందేహాలు తలెత్తడంతో వాటిని నివృత్తి చేసేవారు లేకపోవడంతో గందరగోళానికి గురయ్యారు. గ్యాస్ కార్డులో కుటుంబ యజమాని పేరుతో ఉంది.. దీనిపై సబ్సిడీ వస్తుందా.. అని కౌంటర్ వద్ద ప్రశ్నించగా.. దీనికి వారు సమాధానం చెప్పలేకపోతున్నారు.

కౌంటర్లను పరిశీలించిన ఎమ్మెల్యేలు, అధికారులు

ప్రజా పాలన గ్రామసభల వద్ద ఏర్పాటు చేసిన కౌంటర్లను ఆయా నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు పరిశీలించారు. కొత్తగూడెంలో కూనంనేని, ఇల్లెందులో కోరం కనకయ్య, అశ్వారావుపేటలో జారే ఆదినారాయణ, పినపాకలో పాయం వెంకటేశ్వర్లు, భద్రాచలంలో తెల్లం వెంకట్రావు పరిశీలించారు. అశ్వాపురం మండలం అమెర్దాలో అదనపు కలెక్టర్ రాంబాబు, చుంచుపల్లి మండలం వెంకటేశ్వర కాలనీలో జెడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖరరావు ప్రజా పాలన కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఏడాది నుంచి బియ్యం రావట్లేదు..

నాకు తెల్ల కార్డున్నా బియ్యం రావడం లేదు. ఈ కార్డు నెంబర్ వేస్తే నాకు పథకాలు వస్తాయా.. రావా.. తెలియడం లేదు. ఆన్‌లైన్ చేసుకోవాలని చెప్పారు. చాలా సార్లు తిరిగినా ఆన్‌లైన్‌లో చూపించడం లేదు. నాకు ఐదు గ్యారెంటీలు వస్తాయా.. రావా. ఎవరిని అడిగినా సమాధానం చెప్పడం లేదు. దరఖాస్తు ఇస్తే తీసుకుని రశీదు ఇచ్చారు. కొత్త కార్డు కావాలంటే ఈ దరఖాస్తులో ఎక్కడ రాయాలో కాలం ఇవ్వలేదు.

– కొయ్యడ శారద, ఎన్‌కే నగర్, చుంచుపల్లి మండలం

ముగిసిన శ్రీరామ పునర్వసు దీక్షలు

శ్రీరామ పాదుకలతో గిరి ప్రదక్షిణ

శ్రీరామపాదుకలతో గిరిప్రదక్షిణ చేస్తున్న ఈవో రమాదేవి, అర్చకులు

భద్రాచలం, డిసెంబర్ 28 : భద్రాచలం శ్రీ సీతా రామచంద్రస్వామి దేవస్థానంలో డిసెంబర్ 1వ తేదీన ప్రారంభమైన కార్తీక పునర్వసు దీక్షలు గురువారం ముగిశాయి. దీక్షా విరమణను పురస్కరించుకొని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భద్రాద్రి రామాలయానికి తరలివచ్చారు. తెల్లవారుజామున పావన గోదావరిలో పుణ్య స్నానాలు ఆచరించి రామాలయానికి చేరుకున్నారు. స్వామివారి నిత్య కల్యాణాలు జరిపే బేడా మండపంలో శ్రీరామ మాలధారులు తిరువడి సామగ్రితో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి పాదుకలకు విశ్వక్సేన ఆరాధన, భగవత్ పుణ్యాహవాచన జరిపించారు. ఈవో రమాదేవి తన శిరస్సుపై శ్రీరామ పాదుకలతో భద్రగిరి ప్రదక్షిణ చేశారు. అయితే ఈ ఏడాది నగర ప్రదక్షిణ చేయలేదు. దీంతో భక్తులు స్వామివారికి హారతులు ఇచ్చేందుకు వేచిఉండి ఎంతకు రాకపోవడంతో నిరాశ చెందారు. గత 15ఏళ్లుగా వస్తున్న సంప్రదాయాన్ని ఆలయ అధికారులు విస్మరించడంతో భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రామభక్తులు భద్రుడి కోవెలలో తిరువడి సమర్పించారు. సాయంత్రం స్వామివారికి వెండి రథోత్సవం వైభవంగా జరిగింది.

నేడు రామయ్యకు పట్టాభిషేకం

కార్తీక పునర్వసు దీక్షలు ముగిసిన మరుసటి రోజు శ్రీరామదీక్షాపరులతో శ్రీరామ పట్టాభిషేకం నిర్వహించడం సంప్రదాయం. అందులో భాగంగా శుక్రవారం స్వామివారి నిత్య కల్యాణం పూర్తయిన తరువాత అదే వేదికపై స్వామివారికి పట్టాభిషేకం నిర్వహించనున్నారు.

హోరాహోరీగా క్రికెట్ పోటీలు

మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందజేస్తున్న ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు

భద్రాచలం, డిసెంబర్ 28 : నెహ్రూ కప్(తాళ్లూరి భారతీదేవి స్మారక) అంతర్రాష్ట్ర క్రికెట్ పోటీలు గురువారం భద్రాచలం ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో హోరాహోరీగా సాగాయి. ఉదయం జరిగిన మ్యాచ్‌లో మార్నింగ్ స్టార్ భద్రాచలం, ఎఫ్‌సీసీ ఎలెవన్ మధ్య జరిగిన పోరులో భద్రాచలం జట్టు విజయం సాధించింది. ఎఫ్‌సీసీ జట్టు మొదట బ్యాటింగ్ చేసి 14 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 62 పరుగులు చేయగా.. అనంతరం బ్యాటింగ్ చేసిన భద్రాచలం జట్టు 8.1 ఓవర్లలోనే 63 పరుగులు చేసి విజయం సాధించింది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎంపికైన నాగార్జునకు ఐటీసీ పీఎస్‌పీడీ బీఆర్‌టీయూ అధ్యక్షుడు సానికొమ్ము శంకర్‌రెడ్డి అవార్డు అందజేశారు. సాయంత్రం ఏఎన్‌సీ లెవన్, బీట్ లెవన్ మధ్య పోరు జరగ్గా.. ఏఎన్‌సీ జట్టు 15 ఓవర్లలో 139 పరుగులు చేయగా.. అనంతరం బ్యాటింగ్ చేసిన బీట్ లెవన్ జట్టు 87 పరుగులు చేసి ఓటమి పాలైంది. ఎస్‌బీసీ క్రికెట్ అకాడమీ జట్టు, బీఎఫ్‌సీ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఎస్‌బీసీ అకాడమీ జట్టు 15 ఓవర్లలో 125 పరుగులు సాధించగా.. అనంతరం బ్యాటింగ్ చేసిన బీఎఫ్‌సీ జట్టు 12.5 ఓవర్లలోనే 126 పరుగులు చేసి గెలుపొందింది. బీఎఫ్‌సీ జట్టులో 57 పరుగులు సాధించిన అక్షయ్‌సాయికి భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును అందజేశారు.

భద్రాద్రి రామయ్యకు నిత్య కల్యాణం

కల్యాణం జరిపిస్తున్న అర్చకుడు

భద్రాచలం, డిసెంబర్ 28: భద్రాద్రి దివ్యక్షేత్రంలో గురువారం సీతారాములకు అర్చకులు నిత్య కల్యాణాన్ని నిర్వహించారు. తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచి స్వామివారికి సుప్రభాత సేవ, ఆరాధన, అరగింపు, సేవాకాలం, నిత్య హోమాలు, నిత్య బలిహరణం, నిత్య పూజలు జరిపారు. అనంతరం స్వామివారి నిత్య కల్యాణ మూర్తులను బేడా మండపానికి తీసుకొచ్చి శాస్త్రోక్తంగా నిత్య కల్యాణం నిర్వహించారు. కల్యాణంలో పాల్గొన్న భక్తులకు స్వామివారి ప్రసాదాలు, శేష వస్త్రాలను అందజేశారు.

రాష్ట్రస్థాయి క్రీడలు ప్రారంభం

పోటీలను ప్రారంభించిన ఖమ్మం జిల్లా రీజినల్ కోఆర్డినేటర్ వెంకటేశ్వరరాజు

తలపడనున్న నాలుగు జోన్ల క్రీడాకారులు

కబడ్డీ ఆడుతున్న క్రీడాకారిణులు

ఇల్లెందు రూరల్, డిసెంబర్ 28 : సుదిమల్లలోని గిరిజన బాలికల గురుకుల కళాశాలలో ఏడవ రాష్ట్రస్థాయి గిరిజన గురుకులాల బాలికల క్రీడా పోటీలు గురువారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. పోటీలను ఉమ్మడి ఖమ్మం జిల్లా రీజినల్ కోఆర్డినేటర్ టి.వెంకటేశ్వరరాజు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అండర్-14, 17, 19 విభాగాలవారీగా ఈ నెల 31వ తేదీ వరకు క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఒక్కో జోన్ నుంచి 300 మంది క్రీడాకారుల చొప్పున నాలుగు జోన్లకు కలిపి 1,200 మంది వివిధ అంశాల్లో నిర్వహించే పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. కబడ్డీ, వాలీబాల్, ఖో-ఖో, టెన్నికాయిట్, హాకీ, క్యారమ్స్, బాల్ బ్యాడ్మింటన్, బాక్సింగ్, హ్యాండ్‌బాల్, 100, 200, 1,500 మీటర్ల పరుగుపందెం, లాంగ్‌జంప్, హైజంప్, 600, 400 మీటర్స్ రిలే తదితర విభాగాల్లో పోటీలు ఉంటాయని తెలిపారు. క్రీడాకారులతో భోజన వసతితోపాటు కల్పించినట్లు వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ అరుణకుమారి మాట్లాడుతూ నాలుగు జోన్ల రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు సుదిమల్ల గిరిజన గురుకుల బాలికల కళాశాల వేదిక కావడం గర్వంగా ఉందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సెక్రటరీ శ్రీనివాస్‌రెడ్డి, మోఎస్‌డీ శ్రీనివాస్, డి.శ్రీనివాస్‌కుమార్, గిరిజన క్రీడాల అధికారి రవికుమార్, వివిధ జిల్లాలకు చెందిన రీజినల్ అధికారులు వెంకన్న, సంపత్, లక్ష్మయ్య, నాగార్జున్, పీడీలు, పీఈటీలు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

ర్యాంకుల సాధన కోసం ఆశ్రమ విద్యార్థినులను సన్నద్ధం చేయాలి : ఐటీడీఏ పీవో

విద్యార్థినుల సామర్థ్యాన్ని తెలుసుకుంటున్న పీవో ప్రతీక్‌జైన్

దుమ్ముగూడెం, డిసెంబర్ 28: గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న ఈ గ్రేడ్ విద్యార్థినులపై ప్రత్యేక దృష్టి సారించి సంబంధిత సబ్జెక్టు టీచర్లు 10/10 ర్యాంకులు వచ్చేలా సన్నద్ధం చేయాలని భద్రాచలం ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్ అన్నారు. గురువారం మండలంలోని రేగుబల్లి-2 గిరిజన సంక్షేమ బాలికల ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. తరగతిగదులను, విద్యార్థుల స్టడీ సామర్థ